క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన సీఐఐ బృందం

భీమవరం(ప్రకాశంచౌక్‌): జిల్లాలో విపత్తులను ఎదుర్కొవడానికి వినూత్న సమాచారాన్ని సమర్పించాలని సీఐఐ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్‌ చదలవాడ నాగరాణి సూచించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని వాతావరణ మార్పులు, చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి మంగళవారం జిల్లాకు వచ్చిన సీఐఐ (కాన్ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియన్‌ ఇండస్ట్రీ) బృందం తొలుత జిల్లా కలెక్టర్‌ చదలవాడ నాగరాణిని కలెక్టర్‌ క్యాంపు కార్యాలయంలో సమావేశమై చర్చించారు. సీఐఐ బృందం వాతావరణంలో మార్పులు, వాతావరణ కాలుష్యం, పర్యావరణం, అగ్రికల్చర్‌ అండ్‌ వాటర్‌ మేనేజ్‌మెంట్‌ తదితర అంశాలపై అధ్యయనం చేస్తోందన్నారు. జిల్లాలోని అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదికను అందజేయాలని ఈ సందర్భంగా సీఐఐ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్‌ సూచించారు. న్యూఢిల్లీ సిఐఐ సీనియర్‌ కన్సల్టెంట్‌ డాక్టర్‌ స్వాతి సులగన, డిప్యూటీ డైరెక్టర్‌ జెస్సి ఎ ఇనపర్తి, జీసీ ఆర్‌ ఎస్‌ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒకరిపై ఒకరు ఫిర్యాదు

ఉండి: మండలంలోని ఉండి 33 కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వద్ద గత నెల 30వతేదీ రాత్రి జరిగిన ఓ ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జనవరి 30వ తేదీ రాత్రి ఉండి గణపవరం రోడ్డులోని విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వద్ద గల బడ్డీ కొట్టు వద్ద లండా వెంకటదుర్గాప్రసాద్‌ అనే వ్యక్తి తన స్నేహితులతో కలసి నిలబడి ఉండగా భావన సురేష్‌ అనే వ్యక్తి ఆటోలో వచ్చి గుద్దాడని ఒకసారి గుద్దడమే కాకుండా వెనక్కి తిరిగి వచ్చి మళ్లీ గుద్దాడని తనకు గాయాలైనట్లు భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరాడు.అలాగే భావన సురేష్‌ అనే వ్యక్తి ఇటీవలే కువైట్‌ నుంచి వచ్చి 30వ తేదీ రాత్రి అటుగా ఆటోపై వెళ్తుండగా లండా వెంకటదుర్గాప్రసాద్‌, సిలువుం మోహన్‌ అనే వ్యక్తులు పాత గొడవల నేపథ్యంలో తనను అడ్డగించి కొట్టినట్లు అతను కూడా భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా ఇరువర్గాలపైనా మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులపై కుమార్తె ఫిర్యాదు

ఉండి: ప్రేమించి వివాహం చేసుకున్న కారణంగా తనను కొట్టి తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నారంటూ తల్లిదండ్రులు, కుటుంబికులపై కుమార్తె ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా కృత్తివెన్ను గ్రామానికి చెందిన పూర్ణిమాను ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన దొడ్డిగర్ల భాస్కర్‌ కొద్దినెలల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వివాహమైన నాటి నుంచి భర్త వద్దనే పూర్ణిమ ఉంటుంది. అయితే ఈ నెల 1వ తేదీన తల్లిదండ్రులు తిరుమాని నాంచారయ్య, తిరుమాని ధనలక్ష్మీ, తిరుమాని శేఖర్‌, తిరుమాని సురేష్‌ అనే వారు కలిగొట్లకు వచ్చి తమతో వచ్చేయాలని ఆమెను బలవంతం చేయడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో నలుగురు వ్యక్తులు పూర్ణిమాపై దాడి చేసి కొట్టినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయంపై ఎస్సై ఎండీ నసీరుల్లా మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సూపర్‌ సిక్స్‌ హామీలను అమలు చేయాలి

పాలకోడేరు: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కొడవర్తి శివ ప్రసాద్‌ డిమాండ్‌ చేశారు. శృంగవృక్షం గ్రామంలో సుందరయ్య కాలనీలో గ్రామ మాజీ సర్పంచ్‌ బూరా బత్తుల సత్యనారాయణ నిర్మించిన శ్రీచైతన్య నాయిబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం దాత ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్‌ మాట్లాడుతూ నాయిబ్రాహ్మణుల వృత్తికి ఉచిత కరెంటు హామీ పూర్తిస్థాయిలో అమలు జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవస్థానం కమిటీల్లో నాయిబ్రాహ్మణులకు నామినేటెడ్‌ పదవి ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన టీడీపీ నాయకుడు కలిదిండి బుజ్జి మాట్లాడుతూ ఉమా మల్లిఖార్జునస్వామి దేవాలయం కమిటీలో చోటు కల్పిస్తామని ప్రకటించారు. నాయిబ్రాహ్మణసంఘం జిల్లా కార్యదర్శి పసుమర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కుంటుపడ్డ పశు వైద్యం

- మూలనపడ్డ సంచార పశు ఆరోగ్యసేవ వాహనం
- ఇంటి గుమ్మంలోకి అరకొరగా అందుతున్న పశు వైద్యం
- గతంలో రైతులు మెచ్చిన పశు వైద్యసేవలు


ఉండిలో మూలకు చేర్చిన సంచార పశువైద్య ఆరోగ్యసేవ వాహనం

ఉండి: పశువులకు సత్వర వైద్యసేవలందించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సంచార పశు ఆరోగ్యసేవ వాహన సేవలు ఉండి నియోజకవర్గంలో కుంటుపడ్డాయి. పాపం పశువులు అని ప్రజలు, రైతులు జాలి చూపిస్తున్నా కూటమి ప్రభుత్వానికి మాత్రం జాలీ, దయ అనేవి లేనే లేవని రైతులు వాపోతున్నారు. మనుషులే కాదు పశువులు కూడా నిండు ఆరోగ్యంతో ఉండాలని నోరులేని జీవులను జాలితో చూడాలని వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్‌ వైఎస్సార్‌ సంచార పశువైద్య సేవల వాహనాలను ఏర్పాటు చేసింది. పశువులకు కూడా సాధ్యమైనంత వేగంగా వైద్యసేవలు అందించే సదుద్దేశ్యంతో ప్రతి రెండు మండలాలకు ఒక అంబులెన్స్‌ను, పశువుల డాక్టర్‌, వైద్య సిబ్బంది, అంబెలెన్స్‌ డ్రైవర్‌ను ఏర్పాటు చేసి ఎన్నో మూగజీవాలను వైద్యసేవలు అందజేసి వాటి అభివృద్ధికి తోడ్పడ్డారు. వాటి సంతానాభివృద్ధితో పాలవెల్లువను సృష్టించేందుకు, పాడి పశువులతో గ్రామాలు కళకళలాడేలా గత వైఎస్సార్‌ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. కానీ కూటమి ప్రభుత్వం వాటన్నింటికీ మంగళం పాడేసింది. కూటమి ప్రభుత్వ చర్యలవల్ల నియోజకవర్గంలో సుమారుగా 32వేల ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు ప్రాణాలకు ముప్పు వాటిల్లినట్లేనని పలువురు రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడటంతో పాటు పశువులను కూడా కోల్పోతున్నారు. పశువుల ఆరోగ్యానికి ఏదైనా ఇబ్బంది కలిగితే దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత సదరు రైతుదే అన్నట్లు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో రెండు మండలాలకు ఒక వైఎస్సార్‌ సంచార పశువైద్య ఆరోగ్యసేవ వాహనాలను ఏర్పాటు చేసింది. దీనిల్లో భాగంగా ఉండి, పాలకోడేరుకు ఒకటి, ఆకివీడు, కాళ్ళ మండలాలకు ఒకటి చొప్పున సంచార వైద్య సేవల అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

సేవల కోసం 1962..

పశు వైద్యసేవలకు గత ప్రభుత్వం 1962 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే పశువులు ఉన్న ప్రాంతానికి వచ్చి వైద్యం చేసేవారు. వాహనంలో ప్రత్యేకంగా రూపుదిద్దుకున్న పరికరాలు, ల్యాబ్‌ విభాగం అత్యాధునికంగా తీర్చిదిద్దబడ్డాయి.

నియోజకవర్గంలో పశువుల వివరాలు సుమారుగా

ఉండి మండలం	:	9300
కాళ్ళ మండలంలో	:	12000
పాలకోడేరు మండలంలో	:	2400
ఆకివీడు మండలంలో	:	9100

వాహనంలో ఉన్న ప్రత్యేక లిఫ్ట్‌ పరికరం ద్వారా గేదెలు, ఆవులను సైతం సులువుగా వాహనంలోకి ఎక్కించి వైద్యం చేస్తుంటారు. అంతేకాకుండా మెరుగైన వైద్యసేవలు అవసరమైన పశువులను వాహనం ద్వారానే పశు వైద్యశాలలకు తీసుకువచ్చి వైద్యం చేసి తిరిగి ఇంటికి చేర్చే సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఈ వాహనాలు అందుబాటులో లేకపోవడంతో పశువులకు సత్వర వైద్యం అందడంలేదని రైతులు వాపోతున్నారు.

గతంలో ఘనం..

మానవాళికి అజరామజరమైన సేవలందిస్తున్న 108 వాహనాలను దృష్టిలోపెట్టుకుని పశువుల ఫారమ్‌లు, పశుపెంపకాల ప్రాంతాలకు వెళ్లి వైద్యసేవలందించేందుకు 2022లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా పశు వైద్యానికి సంచార వాహనాలను ప్రవేశపెట్టారు. అనతి కాలంలోనే ఈ సంచార వాహన వైద్యసేవలు రైతాంగం మన్ననలు పొందాయి. నిత్యం 20కి పైగా పశువులకు వైద్యసేవలు అందే పరిస్థితి ఉంది.

మానవత్వం ఉండాలి



పశువుల ఆరోగ్యంపై జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధి, మానవత్వంతో ఏర్పాటు చేసిన సేవలు తిరిగి ప్రారంభించాలి. మనుషులు అయితే నోటితో చెబుతారు కానీ పశువులు చెప్పుకోలేవు కదా అందుకే వాటి ఆరోగ్యాన్ని పశువైద్యాధికారులే కాపాడాలి. సంచార పశువైద్య సేవలను తిరిగి ప్రారంభించాలి.

– చిట్టూరి జార్జ్‌, ఉండి

పశువుల ఆరోగ్యాన్ని కాపాడాలి



గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో మనుషులతో సమానంగా పశువుల ఆరోగ్యాన్ని కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాపాడేది. కానీ ఇప్పుడు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మెగా వైద్య శిబిరాలకు మంగళం పాడిన ప్రస్తుత ప్రభుత్వం పశువుల ఆరోగ్యాన్ని ఎలా కాపాడతాయి. పశువులను కాపాడుకోవడం మన సంస్కృతిలో భాగం. వాటిని తప్పనిసరిగా కాపాడుకోవాలి.

– జింనా నాగేశ్వరరావు, ఉండి

ఘనంగా రథ సప్తమి వేడుకలు


సూర్యప్రభ వాహనంపై వెంకటేశ్వరస్వామి

భీమవరం(ప్రకాశం చౌక్‌): భీమవరంలో పలు ఆలయాల్లో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భీమవరం పంచారామక్షేత్రంలో కొలువైన శ్రీసూర్యనారాయణ స్వామి వారికి రథసప్తమి పురష్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే స్వామి వారికి విశేష పుష్పాలంకరణ నిర్వహించారు.

మెంటేవారి తోటలో:

భీమవరం మెంటేవారితోటలోని బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారి ఆలయంలో రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోయ విజయ పవన్‌ సతీష్‌ కుమార్‌, కోయ రవికిరణ్‌ శేషు కుమార్‌, కోయ బాలమురళి శివ ప్రదీప్‌ కుమార్‌, కొమ్మన సాగర్‌ శ్రీరామ్‌ లచే అర్చకులకు వేద పండితులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా సూర్య నమస్కారాలు నిర్వహించారు. భీమవరం జువ్వలపాలెం రోడ్డులో శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో దేవస్థాన చైర్మన్‌ మంతెన రామ్‌కుమార్‌రాజు అనురాధ దంపతులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి


భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ట్రాఫిక్‌ నిబంధనలు విధిగా పాటిస్తే గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చనని అడిషనల్‌ ఎస్పీ (అడ్మిన్‌) వి భీమారావు అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పోలీసు, రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీ, మానవహారాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆటో యూనియన్‌, డ్రైవర్స్‌ సమక్షంలో పట్టణంలోని బైపాస్‌రోడ్డులోని భాష్యం స్కూల్‌ వద్ద నుంచి మార్కెట్‌ యార్డ్‌ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్‌ యార్డ్‌ వద్ద ఏర్పాటు చేసిన మానవహారంలో ఏఎస్పీ భీమారావు మాట్లాడుతూ వాహనదారులంతా రహదారి భద్రత మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్‌ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖాధికారి డి ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్‌ సీఐ వి.నారాయణమూర్తి, భీమవరం వన్‌ టౌన్‌, టుటౌన్‌ సీఐలు ఎం నాగరాజు, జి కాళీచరణ్‌, ఆటో యూనియన్‌ నాయకులు ఇంటి సత్యనారాయణ, పంపన గోపి, ములుగుర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15న ఎస్‌ఆర్‌కేఆర్‌లో విద్యార్థి ఉత్సవం


భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్‌లో విద్యార్థి ఉత్సవం పోస్టర్‌ విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో ఈనెల 15వ తేదీన ప్రతిష్ఠాత్మకంగా విద్యార్థి ఉత్సవం ×త్రిశూల్‌ 2025 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్‌ కెవి మురళీకృష్ణంరాజు చెప్పారు. మంగళవారం విద్యార్థి ఉత్సవం పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్‌ ఎం జగపతిరాజు విడుదల చేసిన సందర్భంగా ప్రిన్సిపల్‌ వివరాలను తెలిపారు. విద్యార్థి ఉత్సవాన్ని కళాశాల ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ డిపార్ట్‌మెంట్‌, ఎస్‌ఆర్‌కెఆర్‌ ఈవెంట్‌ ఆర్గనైజింగ్‌ సెల్‌ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉత్సవంలో ప్రధానంగా సాంస్కృతిక, క్రీడా విభాగాల్లో వివిధ రకాల పోటీలు, వినోదాత్మక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కళాశాల ఫిజికల్‌ డైరెక్టర్‌ పి సత్యనారాయణ రాజు, అసిస్టెంట్‌ ఫిజికల్‌ డైరెక్టర్‌ సీహెచ్‌ హరిమోహన్‌ పాల్గొన్నారు.

లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలి

భీమవరం అర్బన్‌: కార్మిక హక్కుల్ని కాలరాసే లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్‌ పిలుపునిచ్చారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో మంగళవారం పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్‌ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కుల్ని కాలరాసే విధంగా లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలని బుధవారం భీమవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతామని కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. సత్యనారాయణ, కడిమి పాల్‌ రాజు, చిలకపాటి పోలు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కాళ్ల పీహెచ్‌సీలో డాక్టర్‌ సునీల్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

కాళ్ళ: సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్‌ సరాబు సునీల్‌ అన్నారు. మంగళవారం కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్‌ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ సునీల్‌ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. మండలంలోని ప్రతి ఇంటింటికీ తిరుగుతూ ఎన్‌సీడీసీడీ 3.0 సర్వే చేస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆశాడే సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ వైద్యాధికారిగా అవార్డు పొందిన డాక్టర్‌ సునీల్‌ను ఆస్పత్రి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్‌ డీ సునీత, డాక్టర్‌ టీ భావన పాల్గొన్నారు.

సమాజంలో మార్పు తెచ్చేవారుగా ఉండాలి


చెరుకువాడలో జాన్సన్‌ను సత్కరిస్తున్న యుపీఎఫ్‌ మండల కార్యవర్గ సభ్యులు

ఉండి: యేసుక్రీస్తు సేవకులైన పాస్టర్స్‌ అందరూ సమాజంలో మార్పు తెచ్చేవారుగా ఉండాలని రాష్ట్ర ప్రాస్టర్స్‌ ఫెలోషిప్‌ కార్యదర్శి బ్రదర్‌ జాన్సన్‌ అన్నారు.మంగళవారం చెరుకువాడలో జీవముగల దేవుని సంఘం చర్చ్‌లో పాస్టర్‌ జయరాజు ఆధ్వర్యంలో యుపీఎఫ్‌ మండలాధ్యక్షుడు రెవరెండ్‌ సోడదాసి పీటర్‌ అధ్యక్షతన యునైటెడ్‌ పాస్టర్స్‌ ఫెలోషిఫ్‌ మండల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన బ్రదర్‌ జాన్సన్‌ మేడిద, వర్మ హాస్పిటల్స్‌ మేనేజర్‌ బ్రదర్‌ రవిశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా యుపీఎఫ్‌ సభ్యులకు హెల్త్‌ కార్డులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో యుపీఎఫ్‌ మండలాధ్యక్షుడు సోడదాసి పీటర్‌, కార్యదర్శి వై యోనాతాను, ట్రెజరర్‌ జయరాజు, గౌరవాధ్యక్షులు డేవిడ్‌మార్కు, దేవవరదానం, కార్యవర్గసభ్యులు సామ్యూల్‌రాజు, చంద్రబాబు, యోహాను, శేఖర్‌బాబు, సుధాకర్‌, బేబీ, కృప తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నిర్మూలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి


జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ చదలవాడ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్‌): విద్యార్థులు ఫిబ్రవరి 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌ చాంబర్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన గోడపత్రికను జిల్లా కలెక్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఫిబ్రవరి 10న అంగన్‌వాడి, పాఠశాలలు, కళాశాలల పిల్లలకు ఆల్బెండజోల్‌ 400 ఎంజి (డి వార్మింగ్‌ మాత్రలు) మాత్రలు తప్పనిసరిగా ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బాల సురక్ష కో–ఆర్డినేటరు బి.భావన, ఇన్‌చార్జ్‌ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బి.భానూ నాయక్‌, ఎన్టీఆర్‌ వైద్య సేవ జిల్లా కో–ఆర్డినేటరు డా. జి.కీర్తి కిరణ్‌, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌కు భయపడొద్దు


క్యాన్సర్‌పై ప్రచారం చేస్తున్న అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌, విద్యార్థులు

ఆకివీడు: క్యాన్సర్‌కు భయపడాల్సిన అవసరం లేదని, అనేక మందులు అందుబాటులో ఉన్నాయని, ముందు జాగ్రత్తలు పాటిస్తూ క్యాన్సర్‌ను అంతమొందించవచ్చునని ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కే.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్‌ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ క్యాన్సర్‌ నివారణకు వంటింటి చిట్కాలతో పాటు, పలు ఆహార నియమాల్ని పాటించాలని సూచించారు. సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామం, పొగ తాగడం, మద్యపానం సేవించడం వంటివి మానివేయాలని చెప్పారు. ప్రకృతి సిద్ధమైన వన మూలికల్ని, ఆకుకూరల్ని భుజిస్తూ ఉండాలని సూచించారు. రోగ నిరోధక శక్తి పడిపోకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని బలపర్చుకోవాలన్నారు. క్రమం తప్పకుండా స్క్రీనింగ్‌ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ముందు జాగ్రత్త చర్యలతో మరింత మేలైన వైద్యం పొందవచ్చునని ప్రిన్సిపాల్‌ చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అపోహలు వద్దు

భీమవరం(ప్రకాశంచౌక్‌): క్యాన్సర్‌ అంటే అపోహ వద్దని, క్యాన్సర్‌ను గుర్తిస్తే 90 శాతం వరకు ట్రీట్‌మెంట్‌ ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్‌ బి భానునాయక్‌ అన్నారు. ప్రపంచ కాన్సర్‌ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కాన్సర్‌పై విజయం– స్క్రీనింగ్‌ తో సాధ్యం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. భానునాయక్‌ మాట్లాడుతూ వ్యాధి పట్ల అవగాహన అవసరమన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్‌ ఎన్‌సీడీ డా సీహెచ్‌ ధనలక్ష్మి, జిల్లా ఎన్‌టీఆర్‌ ఆరోగ్య సేవా కో ఆర్డినేటర్‌ డా ఎస్‌.కీర్తి కిరణ్‌, జిల్లా ఎపిడీమోలాజిస్ట్‌ జి.సుభాష్‌, చెరుకువాడ రంగసాయి, డిప్యూటీ డెమో అనంతలక్ష్మి, వీఎస్‌ఆర్‌ కె కుమారి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

పాలకోడేరు: క్యాన్సర్‌ మహమ్మారిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ చినమిల్లి వెంకట రంగనాయుడు అన్నారు. పాలకోడేరు పీహెచ్‌సీ వద్ద క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్‌ స్వర్ణనిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

జీవనశైలిలో మార్పులు క్యాన్సర్‌కు కారణం


కేజీఆర్‌ఎల్‌ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్‌ శ్రీకాంత్‌

భీమవరం: జీవనశైలిలో మార్పులు, కాలుష్యం పొగాకు, మద్యపానం అనారోగ్యకరమైన ఆహారం వంటివి క్యాన్సర్‌కు కారణమని క్యాన్సర్‌ ఆసుపత్రి డాక్టర్‌ సీహెచ్‌ నల్లం శ్రీకాంత్‌ అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్‌ దినోత్సవం సందర్భంగా భీమవరం కేజీఆర్‌ఎల్‌ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్‌ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్యాన్సర్‌ వ్యాక్సిన్స్‌పై సరైన అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ మెంటే హరనాథ్‌బాబు, వైద్యులు వి నాగబాబు, మధుబాబు, కళాశాల పీజీ కోర్సెస్‌ డైరెక్టర్‌ తోట రామ్మూర్తి, ఎంబీఏ డైరెక్టర్‌ సీహెచ్‌ వినోదరావు, మల్లుల గంగాధరరావు, బి శ్రీనిధి, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ పి కిరణ్మయి, ఎన్‌ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌ జిల్లా గవర్నర్‌ వేణు బాబు

ఆకివీడు : మండలంలోని దుంపగడప గ్రామంలో మంగళవారం లయన్స్‌ జిల్లా గవర్నర్‌ కాకరాల వేణుబాబు పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెండింగ్‌ మిషన్‌ను ప్రారంభించారు. అనంతరం లయన్స్‌ కార్యాలయంలో నాలుగు క్లబ్‌ల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడిన ఆయన సేవల కోసమే లయన్స్‌ క్లబ్‌ పుట్టిందని చెప్పారు. జిల్లా కలెక్టర్‌ నుంచి ఉత్తమ సేవా అవార్డు అందుకున్న నేరెళ్ల రామ చెంచయ్యను, లయన్స్‌క్లబ్‌ అధ్యక్షులను సత్కరించారు. ఆదర్శ క్లబ్‌ అధ్యక్షుడు కాకర్ల రాజరాజేశ్వరి, కార్యదర్శి మోరా జ్యోతిరెడ్డి, లయన్స్‌ అధ్యక్షుడు కంభంపాటి నర్సింహం, అభయ క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ జక్కీ పాల్గొన్నారు.

ధర్మాపురంలో ఆక్రమణల తొలగింపు

- కోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని కమిషనర్‌ వెల్లడి
- ఆదేశాలు చూపించాలని పట్టుబట్టిన బాధితులు
- ఆదేశ పత్రాలు చూపించలేదని నిరసన


స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని ఖాళీ గుడిసెను తొలగిస్తున్న అధికారులు

ఆకివీడు: కోర్టు ఆదేశాలు లేకుండానే తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, తమకు గడువు ఇవ్వాలని కోరినా పట్టించుకోవడం లేదని స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని మంచినీటి చెరువు గట్టు ఆక్రమణదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో ఆక్రమణదారుల ఇళ్ల తొలగింపును మంగళవారం అడ్డుకున్నారు. అనంతరం నిరసన ధర్నా చేశారు. తొలుత ఆక్రమణదారులు సొంతంగా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని నగర పంచాయతీ కమిషనర్‌ జీ.కృష్ణమోహన్‌, ఎస్‌ఐ హనుమంతు నాగరాజు ఆదేశించారు. గత నాలుగు నెలలుగా చెబుతున్నా పట్టించుకోకపోవడంతో సిబ్బందితో, జేసీబీతో అధికారులు ఇళ్ల తొలగించేందుకు ముందుకు వచ్చారు. ఆక్రమణదారులు ఆవేదనతో అడ్డుకున్నా ఫలితం దక్కలేదు. తమంతట తాము ఖాళీ చేస్తామని చెప్పినా పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీ చేసుకుంటామని చెప్పడంతో ఒక దశలో అవకాశం కల్పించారు. ఆ తరువాత కోర్టు ఆదేశాల్ని చూపిస్తేనే ఖాళీ జేస్తామని చెప్పడంతో అధికారులు ఆదేశాల్ని చూపించలేదు. దీంతో వారు కోర్టు ఆదేశాలు లేకుండా తమ గూడు తొలగిస్తారా అని నిరసన ధర్నా చేశారు. అనంతరం అక్కడ నుండి అధికారులు, పోలీసు సిబ్బంది వెళ్లిపోయారు.